నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక : కలెక్టర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : నేడు (సోమవారం) ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక జిల్లా పరిషత్ లో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో విడాట్ ఇన్) వెబ్సైట్లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశాలాంధ్ర శ్రీకాకుళం

సోమవారం 4, ఆగస్టు, 2025

సోషల్ మీడియాను కట్టడి చేసేందుకు చట్టం తీసుకురావాలి

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర - పలాస : సోషల్ మీడియాలో మహిళలను టార్గెట్ చేస్తూ విమర్శిస్తున్న వారిని శిక్షించేందుకు ఒక చట్టం తీసుకురావాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను కోరారు. ఆదివారం పలాస టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియాను అదుపులోకి పెట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని చట్టాలను మార్చాలని రిజర్వేషన్లు చూడకుండా తప్పు చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న తమ కుటుంబంను టార్గెట్ చేస్తూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రొద్బలంతో కొంతమంది ఆయన అనుచరులు సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణతో రెచ్చిపోతున్నారని వారిని కట్టని చేయవలసిన అవసరం ఉందన్నారు. పలాస మండలం సున్నా దేవి గ్రామానికి చెందిన దివ్యాంగుడు దున్న బాలకృష్ణ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈయన వైసీపీ సానుభూతిపరుడైన దివ్యాంగుల పెన్షన్ ను అందజేస్తున్నామని ఆయనకు శారీరక వైకల్యమే కాదు మానసిక వైకల్యం కూడా ఉందని అన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే టిడిపికి చెందిన అనేక మంది పెన్షన్లను రద్దు చేయించిన బాలకృష్ణ తన తల్లికి వితంతు పెన్షన్ కూడా అందజేస్తున్నామని గుర్తు చేశారు. బాలకృష్ణ సోదరుడు ఆర్మీలో ఉద్యోగం చేస్తున్న మానవతా దృక్పథంతో పెన్షన్లను రద్దు చేయకుండా అందజేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పైన, రాష్ట్ర మంత్రి అచ్చేనాయుడు పైన, తన పైన కూడా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, ఆరోపించారు. శనివారం సాక్షి ఛానల్లో తన భర్త వెంకన్న చౌదరిపై అసత్యాలు ప్రచారం చేశారని, ఎమ్మెల్యేగా తాను ఖండన ఇస్తే.. ఆ క్లిప్పింగు ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడని అన్నారు. తాను అధికారంలో ఉన్న లేనప్పుడు కూడా టార్గెట్ అవుతున్నానని ఇలాంటి తప్పుడు విమర్శలకు భయపడేది లేదని అన్నారు. బాలకృష్ణ పై చర్యలు తీసుకోవాలని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అప్పలరాజుకు ఐదేళ్లు ప్రజలు అవకాశం ఇస్తే నీచాతి నీచంగా రాజకీయాలను తీసుకొచ్చారని.. తాను విలువలతో పెరిగానని.. విలువలతో ఉన్న టిడిపిలో ఉన్నానని అన్నారు. గతంలో అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు హుందాగా ప్రవర్తించారని, అప్పలరాజు చేసినటువంటి రాజకీయాలను ఏ ఒక్క నాయకుడు చేయలేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్లలో అరాచకాలు మహిళలపై దౌర్జన్యాలు జరిగాయే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. తాను గాని తన భర్త వెంకన్న చౌదరిపై గాని ఒక్క అవినీతిని నిరూపిస్తే రాజకీయాలను విరమించుకుంటామని.. లేకుంటే అప్పలరాజు తన చెప్పుతో తానే కొట్టుకోవాలని సవాల్ విసిరారు. బాలకృష్ణ సోషల్ మీడియాలో పెట్టిన క్లిప్పింగులను విలేకరులకు చూపించారు.

లక్కవరంలో పశువులకు వ్యాక్సిన్

విశాలాంధ్ర - సోంపేట : మండలం పలాసపురం పంచాయతీ లక్కవరం గ్రామంలో పశువులకు వ్యాక్సిన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ తడక జోగారావు మాట్లాడుతూ రైతులు పశువులకు పలు వ్యాధులు సోకకుండా ముందస్తు టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ శిరీష, పాడి రైతులు పాల్గొన్నారు.

వైసీపీ నేత భూర్లి ఒదార్యం

మృతుని దహన సంస్కారణలకు రూ.10 వేలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కొత్తూరు : మండలం మెట్టూరు బిట్ వన్ పంచాయతీ పెద్ద సంకిలి గ్రామంలో జన్ని రాములు అనారోగ్యంతో మరణించారు. అని తెలిసి అక్కడికి వెళ్లి వారి కుటుంబ సభ్యుల ను వైసిపి జిల్లా నాయకులు భుర్లి. శ్రీనివాసరావు ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు గ్రామ పెద్దలు అదపాకల లక్ష్మణరావు కృష్ణారావు చేతుల మీదుగా 10000 రూపాయల దహన సంస్కార ములుకు ఆర్థిక సహాయాన్ని భూర్లి అంది ంచారు. వీరితో నాయకులు రౌతు సోమేశ్వర రావు, సవలపురం బాలు, కూనవల్లి రాజశేఖర్, పతివాడ తిరుపతిరావు బడ్డు నేతాజీ ధర్మరావు పాల్గొన్నారు

రెడ్డి కులమంతా ఐక్యమత్యంగా ఉండాలి

విశాలాంధ్ర - కవిటి : రెడ్డి కుల మంతా ఐకమత్యంగా ఉండాలని ఆ కుల పెద్దలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పూరి, గంజాం, శ్రీకాకుళం రెడ్డిక మహాజన పురోభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కొత్త కొజ్జిరియా గ్రామం వద్ద ఉన్న రెడ్డికుల సంఘం భవనం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల 100 ఏళ్ల సంఘం ఖ్యాతిని బావితరాలకు అందించేందుకు భవనం ప్రాంగణంలో స్తూపాన్ని నిర్మించేందుకు భూమి పూజ చేశారు. ఈ స్తూపం 100 రోజుల్లో పూర్తి. చేసుకుని 100 ఏళ్ల వేడుకలు నిర్వహించుటకు తీర్మాణించారు. ఈ కార్యక్రమంలో ఇరు రాష్ట్రాలకు చెందిన వివిధ హోదాల్లో వున్న రెడ్డి కుల పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ యువకులు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం కర్రిపుట్టుగ గ్రామానికి చెందిన చిన్నారి కర్రి సంజన ఉదర సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారు.విషయం తెలుసుకున్న కవిటి మండలం ఎస్ఎఫ్ఐ సభ్యులు ఆదివారం రూ. 10 వేలను గ్రామ పెద్దల చేతుల మీదుగా అందజేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి చిన్నారిని ఆర్థికంగా ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఎస్ఎఫ్ఐ సభ్యులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్న ప్రభుత్వం

ఆందోళనలో ఉపాధ్యాయ లోకం

విశాలాంధ్ర - ఆమదాలవలస : రాష్ట్రంలోని పాఠశాలల పరిధిలో ఇటీవలే పంపిణీ చేసిన "మూల్యాంకన పుస్తకాలు" విద్యా రంగాన్ని తీవ్ర ఆవేదనలోకి నెట్టివేశాయి. ఉపాధ్యాయులు ఒక్కో విద్యార్థికి వందల సంఖ్యలో స్కాన్లు చేయాల్సిన పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. విద్యార్థుల నోట్‌బుక్స్, ప్రాజెక్టులు, పరీక్ష పత్రాలను సకా లంలో దిద్దటానికి వీలుకూడా లేకుండా ప్రభుత్వం నిర్దాక్షిణ్యం గా టెక్నాలజీ పేరుతో మానవ శక్తిని విస్మరిస్తూ మానసిక వత్తి డికి లోను చేస్తోంది. ఒక ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపా ధ్యాయులు 15 మంది విద్యార్థుల స్కాన్లను అప్లోడ్ చేయా లంటే, కనీసం 45 స్కాన్లు. పైగా అది ఏ ఫార్మాట్ లో ఎప్పుడు అంగీకరిస్తుందో నెట్వర్క్ సమస్యలు అధిగమించి అధికారుల ప్రాపకం కోసం పనిచేయడం దినదిన గండంగా మారింది. అలానే, దిద్దిన ప్రతి ప్రశ్నకు స్కోర్ ఇవ్వడం, ఎందుకు ఇచ్చా మన్న విషయాన్ని రాయడం వంటి పనులు అసలు టీచింగ్ కంటే ఎక్కువ సమయం పడుతున్నాయి. ఇవన్నీ విద్యార్థి అభివృద్ధికి కాకుండా, అధికార తంత్రాలు తీర్చడానికి మాత్రమే జరుగుతున్నాయి. ఉపాధ్యాయునికి పని సమయం 9 ఎఎం నుంచి 5పి ఎం గానీ, తదుపరి విద్యాశక్తి కార్యక్రమం కూడా తప్పనిసరి కావడంతో విశ్రాంతికి తావు లేదు. పైగా సెలవుల్లో, ఆదివారాల్లో పనులు అప్పగించడమే గాక, వాటికి చివరి గడువు సోమవారం అని చెప్పటం అధికార వ్యవస్థ బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట. 10వ తరగతి పరీక్షలను ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే రాయించా లన్న ప్రభుత్వ విధానం, మాతృభాషను దూరం చేయడమే కాకుండా విద్యార్థుల్లో భయాన్ని పెంచుతోంది. ఈ వ్యవస్థలో భయాందోళనలతో ఉపాధ్యాయులు అనారోగ్యా నికి గురవుతున్న వాస్తవం ఎంత కలచి వేసేదో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులపై నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయినట్టుగా వ్యవహరిస్తూ, ప్రతి పనిని డిజిటల్ ఆధారంగా నిర్ధారణ చేయించుకోవడం, వారి వ్యక్తిగత జీవి తాన్ని లెక్కచేయకుండా రాత్రింబవళ్లు పనులు అప్పగించడం దౌర్భాగ్య కరం. ఈ విధంగా ప్రణాళిక లేకుండా, ఉపాధ్యాయు ల పని భారాన్ని పెంచుతూ, విద్యార్థులకు ఉపయోగం లేని విధంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను వెంటనే పునః సమీ క్షించాలని, ఉపాధ్యాయుల మానసిక స్థితిని గౌరవించాలని ప్రభుత్వానికి ఉపాధ్యాయ లోకం విజ్ఞప్తి చేస్తోంది. ఇలాంటి నిర్లక్ష్య, అవివేక పూరిత విధానాలు కొనసాగితే, విద్యారంగంలో నాణ్యత తగ్గడమే కాదు, ఉపాధ్యాయులపై సమాజ విశ్వాసం కూడా కోల్పోతుంది. సమీప భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగవుతాయని ఉపాధ్యాయ వర్గం ఆందోళన చెందుతుంది.

ఏపీ ప్రధానోపాధ్యాయు సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా సత్యనారాయణ, వాసుదేవరావులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయు సంఘం జిల్లా నూతన కార్యవర్గం (ఏపీహెచ్ఏంఏ)ను ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణంలో గల సంఘ భవనంలో జరిగిన సమావేశం లో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వాల్తేటి సత్య నారాయణ, యర్నాగుల వాసుదేవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా పేడాడ దాలినాయుడు, ఎస్.లక్ష్మణరావు, బి.రమణయ్య, ఆర్థిక కార్యదర్శిగా చిలుకు క్రిష్టారావు, వైస్ ప్రెసిడెంట్లుగా సామ వేదుల రమణ, ఎస్.కుమారస్వామి, సనవల రామతకృష్ణ, డివిజన్ కార్యదర్శులుగా చిక్కాల జగన్నాథరావు, ఎస్.యర్రన్నాయుడు, బి.వైకుంఠ రావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర పరిశీలకులుగా విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి సన్యాసిరాజు వ్యవహరించారు. జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.బలరామ కృష్ణారావు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు వీరే!

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులకు ఆదివారం ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీలో మొత్తం 19మంది సభ్యులు ఉన్నారు. అధ్యక్షులుగా, పాగోటి ఉమామహేశ్వరీ, ఉపాధ్యక్షులుగా, గొర్లెల ఎర్రయ్య, డైరక్టర్లుగా, ముద్దాడ నరసమ్మ, బోర యశోద, సురవరం వెంకటరమణ, సాధు ఆనందరావు, కరుకోల దుష్యంత్‌రావు, గేదెల లక్ష్మీనారాయణ, కల్లా నీలవేణి, ఉర్లాపు పద్మ, లబ్బ ధనలక్ష్మీ, వూణ్ణ క్రిష్ణవేణి, తంగుడు నాగేశ్వరరావు, వారణాశి నాగేశ్వరరావు, వారణాశి ఆశాలత, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరక్టర్, నరసన్నపేట గ్రామ పంచాయితీ సర్పంచ్, జిల్లా అగ్రికల్చర్ ట్రేడ్ మార్కెటింగ్ అధికారి, పోలాకి పిఏసియస్ అధ్యక్షులు ప్రమాణం చేశారు.

చోరీ కేసులో ముగ్గరు నిందితులు అరెస్టు

ఐదు తులాల బంగారం, 450 గ్రాములు వెండి స్వాధీనం

కాశీబుగ్గ డిఎస్పీ వెంకటఅప్పారావు

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ పరిసర గ్రామాలలో తాళం వేసి ఉన్న ఇళ్లలో పలు చోరీలకు పాల్పడిన ఒడిశా రాష్ట్రానికి చెందిన సంతోష్ సాహు, రాజ్ కుమార్ సేతీ, బబుల్ల సేతీ అనే ముగ్గురు నింధితులు చోరీ చేసిన బంగారంను అమ్మేందుకు కాశీబుగ్గ వస్తుండగా ఆదివారం కోసంగిపురం జంక్షన్ వద్ద అరెస్టు చేసి, వారి వద్ద ఐదు తులాల బంగారం, 450 గ్రాములు వెండి, 8 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని కాశీబుగ్గ డి.ఎస్.పి వి. వెంకట అప్పారావు తెలిపారు.ఆదివారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుల వివరాలు ఆయన వెల్లడించారు. నింధితులు కాశీబుగ్గ వివేకానంద కోలనీ, లక్ష్మీపురం, పెద్ద నారాయణపురం గ్రామాలలో తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడడంతో పాటు రెండు చైన్ స్నాచింగ్ కేసులలో నేరాలకు పాల్పడ్డారన్నారు. గతంలో వీరు ఆంధ్రా, ఒరిస్సా ప్రాంతాలలో మోటారు సైకిళ్ల దొంగతనం చేసిన నేరానికి ఒరిస్సా జైలులో శిక్ష అనుభవించి, బయటకు వచ్చి మళ్లీ దొంగతనాలకు పాలడుతున్నారన్నారు. పలు ఇళ్లల్లో దొంగతనం కేసులపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ కు అందిన ఫిర్యాదులు మేరకు తమ వద్ద ఉన్న టెక్నాలజీని వినియోగించి నింధితులను పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ నింధితులు ముందుగా తాళం వేసి ఉన్న ఇళ్ల ప్రాంతాలలో రెక్కి నిర్వహించి నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఇళ్లలో బంగారం, వెండి వంటి విలువైన వస్తువులు ఉంచి తాళాలు వేసి బయటకు వెళ్లడం సరికాదని, విలువైన వస్తువులు ఇంటిలో ఉంటే బంధువులకు ఆ ఇంటిలో ఉంచాలని, లేదా మీతో పట్టుకువెళ్లాలని ప్రజలకు డి.ఎస్.పి సూచించారు. అదే విధంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే కేసులు చేదించేందుకు సులువుగా ఉంటుందన్నారు. ఈ కేసులు ఛేదించేందుకు ప్రతిభ కనభరిచిన కాశీబుగ్గ. సిఐ పి.సూర్యనారాయణ, ఎస్ఐ ఆర్.నర్సింహమూర్తి, హెచ్‌సిలు ఎ.శ్రీనివాసరావు, గవరయ్య, కానిస్టేబుల్స్ ఉషాకిరణ్, నీలకంఠం లకు కాశీబుగ్గ డి.ఎస్.పి అభినందించారు.

ఆదిత్యుని దర్శించుకున్న హోం మంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖా మంత్రి వంగలపూడి అనిత అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని ఆదివారం దర్శించుకున్నారు. శ్రీ సూర్య నారాయణ స్వామి వారిని దర్శించుకుని వేద పండితులు ఆశీర్వచనాలు అందుకున్నారు. శ్రీ సూర్య నారాయణ స్వామి దేవస్థానం ఈఓ మంత్రికి శ్రీ సూర్య నారాయణ స్వామి వారి చిత్రపటం అంద జేశారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రికి జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఘన స్వాగతం పలికారు. మంత్రితో పాటు మాజీ శాసన సభ్యులు గుండ లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు దగా చేసిన కూటమి ప్రభుత్వం

ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర - నరసన్నపేట : రాష్ట్రంలో రైతాంగానికి కూటమి ప్రభుత్వం మళ్ళీ దగా చేసిందని జిల్లా వైసిపి అధ్యక్షులు, ధర్మాన కృష్ణ దాస్ విమర్శించారు. ఆది వారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ ఎన్నికల ముందు రైతులకు రూ.26వేలు ఇస్తామని హాదావిడి చేసి, ఇప్పుడు 14నెలల తర్వాత కేవలం 7.5లక్షల మందికే అన్నదాత సుఖీభవ పంపిణీ చేశారని దుయ్యబట్టారు. గత ఏడాది రూ.10,716కోట్లు రైతులకు ప్రభుత్వమే ఎగనామం పెట్టిందని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వ హాయాంలో రైతులకు పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు అందచేసి, రైతు మద్దతు ధర అందించ టంతో పాటు పంటల భీమాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందచేశామని తెలిపారు. నేడు ఆ రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసి, కనుమరుగు చేస్తున్నారని తెలిపారు. రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అతి త్వరలో రైతాంగం గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. ఈ రైతు వ్యతిరేక విషయాలను ఈనెల 4వ తేదీన జిల్లాలో అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలతో కలిసి, జిల్లా కలెక్టర్‌కు మెమోరండం సమర్పిస్తామని తెలిపారు.

ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజాస్వామ్య విరుద్ధం

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రవి

విశాలాంధ్ర - పలాస : విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు,ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఆదివారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద అఖిల భారత విద్యార్థి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల కాపీలను దహనం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు కార్పొరేటర్లకు పెంచి పోషించడానికేనని, విద్యార్థుల సమస్యలు వెలికి తీసే విద్యార్థి సంఘ నాయకులను అనుమతించకపోవడం దారుణం అని అన్నారు .ఉత్తర్వులు విద్యార్థి హక్కులపై దాడిగా భావిస్తూ, తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ, జీవన్ హేమంత్ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం విశిష్టతను భావితరాలకు తెలియజేయాలి

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర - గార : శ్రీకూర్మనాథ స్వామి వారి యొక్క విశిష్టతను భావితరాలకు తెలియజేసేందుకు పురాతన జ్ఞాపకాలను కాపాడుకోవాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అరసవల్లి శ్రీ సూర్య నారాయణస్వామి వారిని ఆదివారం దర్శించుకున్న అనంతరం ఆమె శ్రీకూర్మనాథ స్వామి వారిని దర్శించుకుని వేద పండితులు ఆశీర్వచనాలు అందుకున్నారు. శ్రీకూర్మనాథ స్వామి వారి ఆలయంలో ఉన్న వేద పండితులు ఆలయం యొక్క ప్రాముఖ్యతను మంత్రికి వివరించారు. ఆలయంలో గోడల పై ఉన్న మ్యూరల్ పెయింటింగ్ గూర్చి మంత్రికి తెలియజేశారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి నరసింహనాయుడు మంత్రికి శ్రీకూర్మనాథ స్వామి వారి చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే చిత్రాలు భద్రత, ఆలయం అభివృద్ధి, తదితర వాటిపై దేవాదాయశాఖ మంత్రితో మాట్లాడతానన్నారు.

మంత్రులు చిత్రపటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : అన్నదాత సుఖీభవ పథకం రైతన్నలకు అందజేయడం రైతులు కళ్ళల్లో వెలుగులు నిప్పునట్లు అయిందని సంతబొమ్మాలి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. ఈ మేరకు ఆదివారం సంతబొమ్మాలి లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చంనాయుడు, కేంద్ర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ పథకం సూపర్ సిక్స్ పథకాల్లో ఒక భాగమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కూచెట్టి కాంతారావు, మెండ అప్పారావు, అట్టాడ రాంప్రసాదరావు, అల్లు రమేష్, చల్ల జగ్గారావు, పప్పు కృష్ణ, కూచెట్టి భానుప్రకాష్, ఆరంగి వసంతరావు, వంగ అసిరినాయుడు, బుచ్చ మురళి, శవాన ప్రసాదరావు, చిన్ను రవి, ధూపాన రమణారెడ్డి తోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

మన సమస్యలు మనమే పరిష్కరించుకుందాం : డా. పోతురాజు శ్రీధర్

విశాలాంధ్ర - హిరమండలం : మన పంచాయతీ లోని మన సమస్యలను మనమందరం ఐక్యత తో కలసి మనమే పరిష్కారం చేసుకుందామని హిర మండలం పంచాయతీ పట్టణ టీడీపీ అధ్యక్షులు డా. పోతు రాజు శ్రీధర్ పిలుపు నిచ్చారు. హల్లో గుడ్మార్నింగ్ హిరమండలం అనే కార్యక్రమం ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ఎంజిఆర్ యువసేన సభ్యులు తో కలిసి శ్రీధర్ నిర్వహించారు. అక్కడ సమస్యలు తెలుసుకుని వారం రోజుల వ్యవధిలో సొంత నిధులతో సమస్యల్ని పరిష్కరించి, ప్రజలకి మంచి జరగాలి, సమస్య పరిష్కరించాలని మంచి నిర్ణయంతో రెండవ ఆదివారం 3/8/2025న పాతహిరమండలం మెయిన్ రోడ్ మరియు కుమ్మరి వీధిలో సమస్యలు తెలుసుకోవటం కోసం వెళ్ళటం జరిగింది. పలు సమస్యలు గ్రామ ప్రజలు విన్నవించకున్నారు. సమస్యల్ని వారం రోజుల్లో పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలియచేయటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సహకరిస్తే మేజర్ పంచాయతీ లో సమస్యలు లేని పంచాయతీగా చూడాలన్నదే నా ఆకాంక్ష అని అన్నారు. ఈ సందర్భంగా ప్రతీ సభ్యునికి ప్రజలకు మహిళలకు శ్రీధర్ ధన్యవాదములు తెలిపారు.

ఇచ్చిన స్థలాన్ని అప్పగించండి.. అధికారులకు దళితుడు ఆవేదన

విశాలాంధ్ర - జలుమూరు : దళితునికి ప్రభుత్వం యిచ్చిన స్థలంలోని నిర్మాణాన్ని తొలగించి సెంటు స్థలాన్ని పెత్తందారుడు ఆక్రమించిన ఘటనలో వెంటనే ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని మద్దతు సంఘాలు కోరాయి. జలుమూరు మండలం టెక్కలిపాడు గ్రామంలో 1976 ప్రభుత్వం తమకు యిచ్చిన 5 సెంట్ల నివేశన స్థలంలో 1996లో ప్రభుత్వ ఆర్థిక సహాయంతో పక్కా ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నామని, ఆ ఇంటి పెరటి పునాదిని జెసిబి తో పెకిలించి ఒక సెంటు స్థలాన్ని తన వ్యవసాయ భూమిలో గ్రామ పెత్తందారు చెంచల కృష్ణమూర్తి కలుపుకొన్నాడని దివ్వల రమణ ప్రజా సంఘాల నాయకులకు మొరపెట్టుకున్నాడు. ఈ దురాక్రమణ తొలగించి తన పెరటి స్థలం తనకు ఇప్పించమని గత 7 మాసాలుగా మండల, జిల్లా స్థాయి అధికారులను పలుమార్లు కలిసినా న్యాయం జరగలేదని వాపోయాడు. ఎవరో కొందరు అధికారులు ఇటీవల వచ్చి ఆక్రమించిన భూమి పరిశీలించకుండా పంట కాలువ రోడ్డుకు చెందిన స్థలం అప్పచెప్పే ప్రయత్నం చేస్తున్నారని తెలియజేశాడు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఆక్రమించిన స్థలం ఎలాంటి వత్తిళ్లకు తలొగ్గకుండా దళితునికి ఇప్పించాలని డిమాండ్ చేసారు. అధికారులు రాజకీయ ఆర్థిక బలాలు ఉన్న వారి ఒత్తిళ్లకు లొంగి దళితునికి న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘ నాయకులు కాల నర్సింహులు సవరయ్య, తలసముద్రం మోహనరావుసి ఐ టి యు జిల్లా కమిటీ సభ్యులు ఆర్. సురేష్ బాబు ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు.

రైతాంగానికి ఏఎంసి కార్యవర్గం సహకారమందించాలి

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు..నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన రైతాంగానికి సహాయ, సహకారాలు అందించాలని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నూతనంగా ఎంపికైన ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరక్టర్లు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందచేస్తూ, ప్రజల అభ్యున్నతి కోరుకునే వ్యక్తిగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్, బగ్గు అర్చన, ఎఎంసి ఛైర్మన్, పాగోటి ఉమామహేశ్వరి, వైస్ ఛైర్మన్, గొర్లెల ఎర్రయ్య, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు, నరసన్నపేట, పోలాకి పిఏసియస్ అధ్యక్షులు, ఈశా అప్పారావు, భైరి భాస్కరరావు, టిడిపి నాయకులు, గొద్దు చిట్టిబాబు, బోయిన సతీష్, పూతి రమణ, పీస కృష్ణ, జామి వెంకటరావు, నేతింటి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సృష్టిలో అతి మధురమైనది స్నేహం మాత్రమే

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం అంటూ ఓ సినీకవి అన్నట్లు స్నేహ బంధాల విలువలు తెలియజేషేందుకు స్టార్ వాకర్స్ క్లబ్ సారథ్యంలో ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బంధాలు, అనుబంధాలు ఆప్యాయతలు ఆత్మీయతలు.. రక్త సంబంధీకులు దూరమవుతున్న ఈ యాంత్రిక జీవితంలో ఆపదలో ఉన్నవారిని అక్కున చేర్చుకొని అన్ని విధాలా ఆదుకొనే వారు అసలైన నిజమైన స్నేహితులని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన శాఖ అధికారి రత్నాల వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టిలో తీయనిది, అతి మధురమైనది స్నేహం మాత్రమేనని జీవితంలో మనిషి మరువలేనిది కష్టాల్లో సుఖాల్లో నిలిచి ఉండేది నిజమైన ప్రాణ స్నేహితులు మాత్రమేనని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో స్టార్ వాకర్స్ క్లబ్ సామాజిక సేవల్లో అగ్రభాగాన నిలుస్తుందని అన్నారు. స్నేహగీతం ద్వారా సామాజిక సేవలు మరింత రెట్టింపుగా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆపదలో ఆదుకుంటూ, కష్టాల్లో పక్కనుంటూ, అనునిత్యం ఎదుగు దలలో వుంటూ, సొంత బంధువులు, రక్త సంబంధీకులు చేయలేని పనులు స్నేహితులు మాత్రమే చేస్తారని అన్నారు. అంతకన్నా ముందు ఇటీవల న్యూ ఢిల్లీలో జాతీయ స్థాయిలో అవార్డ్ దక్కించుకున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి రత్నాల వరప్రసాద్ ను, వాకర్స్ కు తీర్థయాత్రలు తీసికొని వెళ్ళి దిగ్విజయంగా తీసుకువచ్చిన రోషిని అనే యాత్రికురాలకు సత్కరించారు. స్టార్ వాకర్స్ క్లబ్ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, గుడ్ల సత్యనారాయణ, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.లక్ష్మీ, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సుగంధం సంజీవ రావు, డాక్టర్ జీఎస్.రావు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నిక

విశాలాంధ్ర - కవిటి : పలాస డివిజన్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పలాస డివిజన్ అధ్యక్షులుగా సనపల.రామకృష్ణ (హెచ్ఎం- బొరివంక), కార్యదర్శిగా సుందరాడ. యర్రంనాయుడు (హెచ్ఎం బాతుపురం), కవిటి మండల కౌన్సిలర్గా ఎస్.శ్రీధర్ (హెచ్ఎం సిలగాం), ఇచ్చాపురం కౌన్సిలర్గా ఎస్.విశ్వనాధం (హెచ్ఎం ధర్మపురం), సోంపేట మండల కౌన్సిలర్గా అనంతరావు (హెచ్ఎం మామిడిపల్లి), కంచిలి ఒరియా కౌన్సిలర్గా భాస్కర్ పాడి (హెచ్ఎం ముండల), మందస కౌన్సిలర్గా తాకేశ్వరరావు, పలాస కౌన్సిలర్గా వీర్రాజు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీరిని మిగతా సభ్యులు అభినందించారు.

కొత్త పింఛన్ల మంజూరుతో లబ్ధిదారుల్లో ఆనందం

విశాలాంధ్ర - ఆమదాలవలస : కొత్త పింఛన్ల మంజూరుతో లబ్ధిదారులకు ఆనందం కలుగు తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీ మణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీలో కొత్తగా మంజూరైన 79 పింఛన్లను ఆదివారం ఆమదాలవలస టిడిపి కార్యాలయం వద్ద పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే అమెరి కాలో జరుగుతున్న శాసనసభ సదస్సులో పాల్గొన్నందున ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతినెల లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పెన్షన్ అందించడంతో వారి ఇళ్లలో ఆనందాన్ని చూస్తున్నామని అన్నారు. కుటుంబంలో భర్తకు పెన్షన్ వచ్చి ఆ భర్త మరణిస్తే వెంటనే భార్యకు పెన్షన్ బదిలీ చేసే విధానాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. దీనివలన అర్హులైన ప్రతి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల అందేలా కృషి చేస్తుందని అన్నారు.

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల లబ్ధిదారులందరికీ ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి క్రమం తప్పకుండా పెన్షన్ పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని, సామాజిక పింఛన్ల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, అర్హులయిన వారికి నెల మొదటి తేదీనే నేరుగా పింఛను అందించడంతో ఈ ప్రభుత్వం తమ వెంట ఉందన్న భరోసా, ధైర్యం, నమ్మకం వారికి కలుగుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంపుదల చేసి గడప వద్దకే అందించడం జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనలో పేదలందరికీ సంక్షేమం అందుతుందన్నారు. అర్హత ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులకు పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఫించన్లు ఎప్పుడూ వస్తుందో తెలియక వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు అనేక ఇబ్బందులు పడేవారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటలకు కట్టుబడి హామీలు అమలు చేసిన గొప్ప ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చరిత్రలో నిలిచిపోతారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా సాగుతోందన్నారు. అవినీతిరహిత పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. జనరంజక పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు పెద్ద ఎత్తున ఆదరిస్తున్నారని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా మంజూరైన 79 పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, టిడిపి జిల్లా కార్యదర్శి మొదలవలస రమేష్, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు సంపద రావు మురళి, టిడిపి నాయకులు తమ్మినేని విద్యాసాగర్, బోర గోవిందరావు, కూన రాము, కూన ఆంజనే యులు, రెడ్డి రాంబాబు, బోనెల అప్పారావు, ఎన్ని శ్రీదేవి, బోయిన సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు, ముఖ్యంగా రోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ టెక్కలి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పూజారి శైలజ సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలం చిన్న హరిచంద్ర పురం గ్రామంలో "ఎన్టీఆర్ ఆరోగ్య సేవ పథకం" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ఇటువంటి పథకాలను పెట్టి రోగులకు మెరుగైన సేవలు అందించే కార్యక్రమం చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్యరంగంలో నిష్ణాతులైన వైద్యులు మన దగ్గరికి వచ్చి సేవలందిస్తారని, అయితే ఈ కార్యక్రమంలో సర్జరీలకు, ఇంకా ఇక్కడ చేయలేని వైద్య పరీక్షలు, ఇతర కార్యక్రమాల కోసం ఆసుపత్రికి రిఫర్ చేస్తారని, ఈ కార్యక్రమాల ద్వారా ఎటువంటి ఆపరేషన్ అయినా ఉచితంగానే చేస్తారని తెలిపారు. అందుకోసం గ్రామీణ పేద ప్రజలు ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కోట సూర్య ప్రకాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉందని, ముఖ్యంగా తమ పరిసరాలు పరిశుభ్రం చేసుకుని, కాచి చల్లార్చిన నీళ్ల త్రాగుతూ, ఏ పూట వండిన వంట ఆ పూట భోజనం చేస్తుండాలని సూచించారు. ఎక్కువ కాలం ఫ్రిజ్లో ఉంచి తీసిన పదార్థాలను వినియోగించవద్దని తెలిపారు. త్రాగి పడేసిన కొబ్బరి బొండాల డొక్కులను గ్రామానికి దూరంగా వేయాలని, అవి ఇంటి ముందే ఉండడం వలన వాటిలో వర్షపు నీరు చేరి దోమలు, క్రిమి, కీటకాలు చేరి మన ఆరోగ్యానికి భంగం కలిగిస్తాయని ఆయన హెచ్చరించారు. ఏ పని చేసిన అనంతరం సబ్బు తో చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నహరిచంద్రపురం తో పాటు చుట్టుప్రక్కల పలు గ్రామాల నుంచి వచ్చిన సుమారు 300 మంది రోగులకు వారు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం మెడికవర్ వైద్యాధికారులు డాక్టర్ కోట దివ్య, డాక్టర్ సిస్టు మనోజ్ కుమార్, మెడికవర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఆది, శని వారాల్లో రద్దు చేసిన డిఎంయును పునరుద్ధరణ చేయండి

విశాలాంధ్ర - జలుమూరు : పలాస నుండి ప్రతి ఆదివారం ఉదయం విశాఖ వెళ్లే డిఎంయు రైలును రద్దు చేయడం భావ్యం కాదని అలాగే శనివారం విశాఖ నుండి పలాస వచ్చే ఇదే రైలును రద్దు చేయడం పలువురు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం పూట ఉద్యోగులకు విద్యార్థిని విద్యార్థులకు అనేకమంది విశాఖపట్నంలో వైద్య సేవలకు వెళ్తుంటారని అటువంటి మంచి రైలును రద్దు చేయడం సమంజసం కాదని పలు ప్రాంత ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి ఈ రైలును పునర్దించాలని ప్రయాణికులు కోరుతున్నారు. సుమారు రెండు నెలల నుండి ఈ రైళ్లను రద్దు చేసినట్లు స్థానికులు తెలిపారు.

బీజేపీలో చేరిన పలువురు విద్యావేత్తలు

విశాలాంధ్ర - నరసన్నపేట : భారతీయ జనతా పార్టీలోకి పలువురు విద్యావేత్తలు, మహిళలు చేరారు. స్థానిక కళ్యాణ మండపంలో శనివారం సాయంత్రం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో బిజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి, చింతు పాపారావు ఆధ్వర్యంలో బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో నరసన్నపేట మండలానికి చెందిన గొండు క్రాంతికుమార్, ఎస్.చిన్నారావు, బగాది రామారావు, డి.మహేశ్వరీ, కె.భాగ్యరత్నం, విటిఆర్.అమరావతి, పి.కల్పన, ఎస్.శ్రీనివాసరావు, పి.అశోక్, కె.మనీష్, ఎస్.శంకరరావు తదితరులు చేరారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలన దక్షతకు ఆకర్షితులమై బిజెపిలో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు, సిరిపురం తేజేశ్వరరావు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే, ఎన్.ఈశ్వరరావు, స్పోక్స్ పర్సన్, పూడి తిరుపతిరావు, మాజీ జెడ్పీటిసి, చింతు శకుంతల ఉన్నారు.

5న మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : కుశాలపురం బైపాస్ రోడ్డుకు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో కౌన్సెలింగ్ కాగా వివిధ బ్రాంచ్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 5న కళాశాల ఆవరణలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సి పాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. మెకాని కల్లో 3, సివిల్లో 1, డీసీసీపీలో 25 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏ కళాశాలలో జాయిన్ కాని విద్యా ర్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని చెప్పారు. కౌన్సెలింగ్ ఫీజుతో పాటు వార్షిక ఫీజు 4,700 రూపా యలు విద్యార్థులు తక్షణమే చెల్లించి అడ్మిషన్ పొందా లన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేయాలన్నారు.

అపూర్వ కలయిక

విశాలాంధ్ర - కవిటి : కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984-89 మరియు 1985-1990 మధ్య కాలంలో 6 నుంచి 10వ తరగతి చదువుకున్న రెండు బ్యాచ్లో ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాఠశాల వద్ద కలుసు కున్నారు. 40 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో చిన్న నాటి విషయాలు నెమరు వేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం సహపక్తి భోజనాలు చేసి అప్పటి గురువులు యర్ర విశ్వనాథం, పోల్లాయి మండల సూర్య నారాయణ, గుడియా మోహనరావు, అప్పారావు, పాతిన చంద్ర శేఖర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.విశ్వనాథంలను ఘనంగా సత్కరించారు.

బీవీకే విద్యార్థులు సత్తా

విశాలాంధ్ర - కవిటి : భారతీయ విద్యా కేంద్రం వారు సంభాగ్ స్థాయిలో ఆదివారం విజయనగరం మహరాణీపేట విజ్ఞాన భారతిలో నిర్వహించిన గణితవిజ్ఞాన మేళా మరియు సంస్కృతి మహోత్సవం కార్యక్రమంలో కవిటి ఆర్ష విజ్ఞాన భారతి విద్యార్థులు సత్తా చాటారు. శిశు వర్గ సంస్కృతీ జ్ఞాన ప్రశ్న మంచ్లో బి. లయ,బి. నందిక, జి.ప్రణవ్ ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే శిశు వర్గ కథ కథనంలో ఇంటెనుక ప్రణీత్ ప్రథమ స్థానం, బాలవర్గ కథ కథనంలో బల్లెడ. శ్రీదీక్షిత, బాలవర్గ మట్టి బొమ్మలు తయారీలో తోట చైతన్య ప్రథమస్థానం, బాలవర్గ వేదిక్ గణితంలో కె.చైతన్య ద్వితీయ స్థానం, వేద గణితంలో కె.చైతన్య, ఎస్. చైత్ర, స్రవంతి, చరిష్మా ప్రథమ స్థానంలో నిలిచారు. వారికి కరస్పాండెంటు బల్లెడ కృష్ణారావు, గొనప దశప్ప, పొందల జానకిరామయ్య, దిక్కల.రాజేశఖర్లు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.అనిల్, శిరీష, డిల్లీరావు, కృష్ణకుమార్, జ్యోతి, అంజలి పాల్గొన్నారు.

హర్షవల్లి లయన్స్కు అవార్డుల వర్షం

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఆదివారం విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ హాల్ లో 316ఎ లయన్స్ ఇంటర్నే షనల్ గవర్నర్ పదవి ప్రమాణస్వీకారం ఉత్సవం అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా హర్షవల్లి లైన్స్ క్లబ్ కు ఉత్తమ సేవలు అందించినందుకు గాను మూడు ప్రత్యేక అవార్డులను అందజేశారు. ఒకే క్లబ్ నుండి నలుగురు సభ్యులకు పదవులను లైన్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్లో పదవుల్ని కేటాయించటం విశేషం లయన్ డాక్టర్ రా చింతాడ కృష్ణమోహన్ రీజియన్ చైర్మన్గా, లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడు క్విజ్ కాంపిటీషన్స్ జిల్లా చైర్మన్గా కరణం శోభారాణి పార్కుల అభివృద్ధి జిల్లా చైర్మన్గా లయన్ కెఎన్ఎస్వి ప్రసాద్ (హారికా ప్రసాద్) అడాప్షన్ జిల్లా చైర్మన్గా నియమితులయ్యారు. హర్షవల్లి లైన్స్ క్లబ్, శ్రీకాకుళం వారు అందించినటువంటి విశిష్ట సేవలను ఈ సందర్భంగా అనేకులు ప్రశంసించారు. అదేవిధంగా క్యాబినెట్ మెంబర్లుగా నియమించబడిన హర్షవల్లి లైన్స్ క్లబ్ నలుగురు మెంబర్లకు అభినందనలు తెలియజేశారు.

లక్ష్మణరావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కళ వెంకట్రావు

విశాలాంధ్ర - రణస్థలం : మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గొర్లె లక్ష్మణ రావు మృతిచెందారన్న విషయం తెలుసుకుని ఆదివారం వారి స్వగ్రామమైన పాతర్లపల్లిలో వారి ఇంటి వద్ద కుటుంబ సభ్యులను చీపురుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కిమిడి కళావెంకటరావు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావెంకట్రావు మాట్లాడుతూ పార్టీ పట్ల అంకితభావం, నిబద్ధతతో పనిచేసిన గొర్లె లక్ష్మణరావు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతి తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రణస్థలం మండల తెలుగుదేశం పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం : కడియాల ప్రకాష్

విశాలాంధ్ర - కవిటి : ఎన్నికల హామీల అమలలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మ్యాచ్ ఆదివారం భైరిపురం, రాజపురం గ్రామాల్లో వైసిపి మండల కన్వీనర్, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ కూటమి ప్రభుత్వం మోసాలపై క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. అనంతరం బైరిపురం గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ .1.5 లక్షలతో నూతన మోటార్ బోర్వెల్ ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో మండల కో ఆప్షన్ సభ్యులు పాండవ చంద్ర శేఖర్,సనపల కృష్ణారావు,పుల్లట జగదీశ్వరరావు, పిరియా ఆనందరావు, ఎస్. కృష్ణారావు, ఎలమంచి నీలయ్య, ఢిల్లీబాబు,సనపల శ్రీనివాసరావు, ఎలమంచి సత్యం, సప్ప గోపాల్రావు, బొర్రా.కీర్తి రావు, కడియాల సాయి, ఎన్.బాలకృష్ణ, కొర్రాయి ధనుంజయరావు, పుల్లట రాజేష్, నూకయ్య, ముద్దపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలతో సమానం
కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ఆమదాలవలస : రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి చిన్ను తెలిపారు. ఆమదాల వలస పట్టణంలో సువ్వారి కళ్యాణ మండపంలో కృతి ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో డాక్టర్ వినోద్ కిడ్స్ హాస్పిటల్ వారి సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. మనిషి ప్రాణాలు నిలిపే రక్తం ప్రాణాపాయ స్థితిలో అందకా చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారికి ఆపద సమయంలో ఈ రక్త నిల్వలు ఎంతగానో ఉపయోగపడతా యి అన్నారు. రక్తం దానం చేసిన వాళ్లు దైవంతో సమానంగా భావించాలని పలువురు వక్తలు సూచించారు. అనుమానా లు, అపోహలకు పోకుండా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తా న్ని దానం చేయాలని సూచించారు. రక్తం దానం చేయడం వలన మానవుని దేహంలో శుద్ధి ఏర్పడి రక్త ప్రసరణ జరిగి ఆరోగ్యవంతంగా జీవించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఈ రక్తదాన శిబిరంలో 85 మంది యువకులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ తాతయ్యలు, డాక్టర్ సిహెచ్ సుధా కర్, సిపాన హేమ మోహనరావు, నవ్య, కృష్ణ, దీప, బగాధి నేతాజీ, కృష్ణ, బమ్మిడి రాము, యశ్వంత్, వసంత్, విక్రమ్, ప్రశాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపటం శ్రేయస్సు : ఎస్ఐ యాసిన్

విశాలాంధ్ర - హిరమండలం : హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంలు నడపటం శ్రేయస్సుకరమని హిరమండలం ఎస్సై మహమ్మద్ యాసిన్ అన్నారు. ఆదివారం సాయింత్రం హిరమండలం లోని కోరాడ జంక్షన్ లో ద్విచక్ర వాహనదారులు ఆటో డ్రైవర్లతో అవగాహన కార్యక్రమం ఎస్సై నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై యాసిన్ మాట్లాడుతూ వాహనం లు నడిపేటప్పుడు అతివేగంగా నడపటం ప్రమాదకరం అని ఆటో డ్రైవర్లు మితి మీరిన ప్రయాణికులను ఎక్కించారాదని వాహనం లు నడిపే ప్రతీ ఒక్కరూ లైసెన్స్లు పొంది ఉండాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రయాణికులు ఉన్నారు.

3 గ్రామాల్లో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు మండలం, పారాపురం పంచాయతీ గుణాభద్ర పంచాయతీ నీలకంతా పురం పంచాయితిల్లో నందు బాబు షూరిటీ మోసం గ్యారంటీ పేదల పతనం గ్యారంటీ రీ కాల్ చంద్రబాబు మేనిపెస్టో అనే కార్యక్రమాన్ని వైసిపి నిర్వహించింది. మండల పార్టీ అధ్యక్షుడు గండి వలస ఆనందరావు ఎంపీపీ సవర సావిత్రమ్మ. పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ బిట్టు 2 సర్పంచ్ యర్లంకి ధర్మారావు ఎంపీటీసీ వనము లక్ష్మీనారాయణ గుడాబండి పోలయ్య ఎంపీటీసీ ప్రతినిధి ఆగతముడి నాగేశ్వరావు గుణాభద్ర సర్పంచ్ వైకుంతరావు గోనభద్ర ఆఫీస్ నీలకంతాపురం మతం పూర్ణ గేదిల చినబాబు మరియు వైస్సార్సీపీ వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

పలాస - కాశీబుగ్గ లయన్స్ క్లబ్కు ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ లయన్స్ క్లబ్కు ఉత్తమ అవార్డు వరించింది. ఆదివారం విశాఖపట్నం రామ్ నగర్ లయన్స్ హాల్ లో జరిగిన లయన్స్ జిల్లా 316 2024-25 సంవత్సరం అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. పల్లాస కాశీబుగ్గ లయన్స్ క్లబ్ అధ్యక్షులు హనుమంతు ఎండుదొర, ప్రధాన కార్యదర్శి టి.మాధవ రావు, కోశాధికారి నెమలి పురి అప్పారావు సభ్యుల సహ కారంతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు గాను అప్పటి గవర్నర్ ప్రొఫెసరు లయన్ ఎన్.వి.బి.ఎస్.ఎస్ ప్రసాద్, ప్రథమ గవర్నర్ కె .వి .సుబ్బరాజు ,రెండవ గవర్నర్ లయన్ నున్నా శ్రీనివాస రావులు అవార్డ్ ప్రదానం చేయగా క్లబ్ సినియర్ సభ్యులు ఎల్.సి.ఐ.ఎఫ్ కోర్డినేటర్ లయన్ డా.తెప్పల కృష్ణమూర్తి స్వీకరించారు. జోన్ ఛైర్ పర్సన్ లయన్ రోణంకి హిమాచలంకు ప్రత్యేక పురస్కారం అందజేసారు.

కిషోర్కు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు శ్రీధర్ పరామర్శ

విశాలాంధ్ర - పలాస : పలాస మండలం చినంచల గ్రామానికి చెందిన పొట్నూరు కిషోర్ అనారోగ్యంకు గురై విశాఖ కేజీహెచ్లో చికిత్స పొందు తున్న సమాచారం తెలుసుకున్న పలాస పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్(బాబా), సిర్ల రవిచంద్ర (బుజ్జి)లు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి కిషోర్ ను కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరి వెంట కూన హేమాచలం, దేవేంద్ర, కంచరాన మధు, బమ్మిడి సురేష్, దవల శ్యాంసుందర్, కొవ్వూరు సంతోష్ లు ఉన్నారు.

కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం జరిగితే...జంతిగెడ్డ రిజర్వాయర్ కనుమరుగయ్యేనా ..?

విశాలాంధ్ర - పలాస-మందస : పలాస నియోజకవర్గం ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం జరిగితే మందస మండలం జంతిగెడ్డ వద్ద రిజర్వాయర్ కలగానే మిగిలి కనుమరుగయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చని ఉద్దానం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిడిమి జంతిగెడ్డ వద్ద రిజర్వాయర్ ను నిర్మించాలని..ఉద్దానం రైతాంగం భూములకు సాగునీరు సౌకర్యం కల్పించాలంటూ ఈ ప్రాంతం రైతాంగం నాలుగు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు. ప్రతి ఎన్నికల్లో రాజకీయ పార్టీలు రిజర్వాయర్ నిర్మాణానికి హామీలు ఇచ్చి ఆ తర్వాత వాటిని మరచిపోతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జంతిగెడ్డ వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు ఉన్నాయి. నిధులు కూడా మంజూరు అయి టెండర్లు కూడా ఖరారు అయ్యాయి. కానీ పనులు మాత్రం పూర్తిగా జరగలేదు. ప్రస్తుతం కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి ప్రభుత్వం తలపెడితే ఈ సాగునీటి రిజర్వాయర్ నిర్మాణం ప్రతిపాదనలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం జరిగితే రిజర్వాయర్ స్థలాలు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, రైతాంగం, వామపక్షాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉద్దానం ప్రాంతంలో బిడిమి జంతిగెడ్డగా పేరు ఉన్న ఈ ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మాణానికి గత కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాల కాలంలో ప్రతిపాదనలో ఉన్నాయి. ఈ రెండు ప్రభుత్వాల పాలనలో ఇక్కడ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కూడా మంజూరు అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో దివంగత నేత మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు భూమి పూజ చేశారు. అప్పట్లో జల వనరుల శాఖ ద్వారా టెండరు ఖరారు చేసుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకుండా రిజర్వాయర్ పనులకు దూరమయ్యారు. ఆ తర్వాత 2014 నుండి 2019 వరకు పాలించిన టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇక్కడ రిజర్వాయర్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు.ఈ రిజర్వాయర్ నిర్మాణానికి 2019 ఫిబ్రవరి 9న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ భూమి పూజ చేశారు. టిడిపి ప్రభుత్వ

పాలనలో కూడా టెండర్ ఖరారై పనులు ప్రారంభానికి నోచుకోలేదు. దీనికి కారణం కాంట్రాక్టర్ నిర్లక్ష్యమేనని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. ఇక్కడ రిజర్వాయర్ నిర్మాణం జరిగితే మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ఉన్న ఉద్దానం ప్రాంతంలోని రైతాంగ వ్యవసాయ భూములకు సాగునీరు సరఫరా అవుతుందని అప్పట్లో జల వనరుల శాఖ అంచనా వేసి ప్రతిపాదనలు రూపొందించింది. తూర్పు కనుమల్లో ఉన్న మహేంద్రగిరి పర్వత శ్రేణుల నుంచి వివిధ కాలువల ద్వారా జంతిగెడ్డ వద్దకు నీరు చేరుతుంది. ఈ గెడ్డ నీరు వివిధ గ్రామాల మీదుగా ఉన్న పిల్ల కాలువల ద్వారా సముద్రంలో కలిసిపోతుంది. వృధాగా పోతున్న ఈ నీరును సద్వినియోగం చేసుకునేందుకు ఉద్దానం రైతాంగానికి ఉపయోగపడే విధంగా బిడిమి పక్కన ఉన్న జంతిగెడ్డ వద్ద రిజర్వాయర్ నిర్మించాలన్న డిమాండ్ ఉద్దానం రైతాంగంలో ఉండడంతో పాలకులు జల వనరుల శాఖ ద్వారా ఇక్కడ రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేసేందుకు కృషి చేశారు. కాగా కార్గో ఎయిర్ పోర్టును నిర్మించాలని కూటమి ప్రభుత్వం తలపెట్టిన తర్వాత పలాస నియోజకవర్గం ఉద్దానం ప్రాంతంలో ఎయిర్ పోర్టును నిర్మాణం జరపాలన్న ఆలోచనతో జిల్లా అధికార యంత్రాంగం అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలోని ఉద్దానం ప్రాంతంలో 14 గ్రామాల పరిధిలో ఉన్న భూములను గుర్తించారు. ఉద్దానం గ్రామంలో రెవిన్యూ పోలీస్ శాఖలు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు ప్రభుత్వ అధికార యంత్రం ఓ పక్క కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం జరిగేందుకు కృషి చేస్తుండగా ఉద్దానం రైతాంగం కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఉంది. ఎయిర్ పోర్టు నిర్మిస్తే వందల సంవత్సరాలుగా జీవనాధారమైన జీడి, కొబ్బరి వ్యవసాయ భూములు అంతర పంటల పొలాలు ధ్వంసమై జీవనాధారం కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎయిర్ పోర్టుకు వ్యతిరేకంగా రైతాంగం కమిటీగా ఏర్పడి ఉద్యమిస్తూ గ్రామాల్లో సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు.రైతుల నుంచి లక్ష సంతకాలు సేకరణ చేస్తున్నారు. ఉద్దానం రైతాంగం ప్రజలు చేస్తున్న ఈ ఉద్యమానికి నియోజకవర్గంలో ఉన్న వామపక్ష పార్టీలు మద్దతు పలికి రైతాంగం ఉద్యమంలో భాగస్వాములయ్యారు. దీంతో కార్గో ఎయిర్ పోర్ట్ కు వ్యతిరేకంగా ఉద్యమం మరింత ఉధృతమవుతోంది. గ్రామాలకు వచ్చే సర్వే బృందాలను నిలదీస్తూ సర్వేలను నిలుపుదల చేస్తున్నారు. చట్ట విరుద్ధంగా తమ జరాయితీ భూముల్లో చొరబడి సర్వే నిర్వహించడం తగదని రైతులు సర్వే బృందాలను ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రధాన ప్రతిపక్షమైన వైసిపి పార్టీ కూడా ఈ ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నారు. కార్గో ఏయిర్ పోర్ట్ నిర్మాణం జరిగితే ఉద్దానం ప్రాంతంలోని ఒక్కొక్క పంచాయతీ పరిధిలో వందలాది ఎకరాల విస్తీర్ణం గల ప్రభుత్వానికి చెందిన కొండ ప్రాంతం ఇతర భూములు సముద్ర తీర ప్రాంతం భూములు తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి పాలకవర్గాలు, కార్పొరేట్ సంస్థలు కుట్ర పన్నుతున్నాయని రైతాంగం భావిస్తోంది. కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో ఇక్కడ సంపదను దోచుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఉద్దానం రైతాంగం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో వేలాది ఎకరాల విస్తీర్ణం గల కొండ ప్రాంతంలో జీడి తోటలను పేద రైతులు పెంచుకొని సాగు చేస్తూ దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్నారని ఇటువంటి పేద రైతులంతా అన్యాయాన్ని గురి అయ్యే అవకాశాలు ఉన్నాయని ఉద్దానం రైతులు అంటున్నారు. కాగా ప్రస్తుతం ఇటువంటి ఉద్యమం ఎటువైపు దారితీస్తుందోనని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కాగా కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం వల్ల ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు అధికార యంత్రాంగం విస్తృతంగా గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఏది ఏమైనా భవిష్యత్తులో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం జరిగితే రైతాంగానికి సాగునీరు అందించే జంతిగెడ్డ కనుమరుగయ్యే ప్రమాదంలో ఉంది.